శిథిల క్వార్టర్లలో బిక్కుబిక్కు..

ఉపాధ్యాయుల కుటుంబాలు శిథిల క్వార్టర్లలో బిక్కుబిక్కుమంటూ నివాసముంటున్నాయి. 30 ఏళ్ల కిందట కట్టిన ఆ భవనాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు వీరి పరిస్థితి దారుణంగా ఉంటోంది. చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో విషసర్పాలు చేరాయి. దీంతో అవి ఎప్పుడు ఇళ్లలో ప్రవేశిస్తాయోనని భయంభయంగా జీవనం సాగిస్తున్నారు.

- కారిపోతున్న ఇళ్లపై టార్పాలిన్లు కప్పుకొని నివాసముంటున్న ఉపాధ్యాయులు
- పాడైన కిటికీలు, తలుపులు, బీటలు వారిన గోడలు
- భవనాల వద్దకు వస్తున్న విష సర్పాలు
- మరమ్మతులు చేయాలని కోరుతున్న టీచర్లు

ముంచంగిపుట్టు: మండలంలోని 11 గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో 76 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు లక్ష్మీపురం, లబ్బూరు, పెదగూడ, బంగారుమెట్ట ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు 42 క్వార్టర్లను 1995 సంవత్సరంలో నిర్మించారు. జోలాపుట్టు, కిలగాడ, భూసిపుట్టు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎటువంటి నివాస గృహాలు లేవు. పాఠశాలల భవనాల్లోనే కొంతమంది సర్దుకుపోతున్నారు. మరికొంత మంది బయట అద్దె భవనాల్లో నివాసం ఉంటున్నారు. 46 క్వార్టర్లలో ప్రస్తుతం 26 ఇళ్లలో ఉపాధ్యాయులు నివాసం ఉంటున్నారు. 16 భవనాలు పూర్తిగా శిథిలమైపోవడంతో ఎవరూ నివాసం ఉండడం లేదు. ఈ 26 క్వార్టర్లలోనూ చాలా భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాలు పూర్తిగా పాడైపోవడంతో ఎప్పుడు ఏ గోడ కూలిపోతుందో తెలియని దుస్థితి ఉంది. గోడలు బీటలు వారాయి. తలుపులు, కిటికీలు పూర్తిగా పాడైపోయాయి. చిన్నపాటి వర్షానికే క్వార్టర్లు కారిపోతుండడంతో పైకప్పుపై టార్పాలిన్లు కట్టుకుని నివసించవలసిన పరిస్థితి నెలకొంది. కొంత మంది ఉపాధ్యాయులు వేరే దారిలేక ఆ క్వార్టర్లోనే నివాసముంటుండగా, మరికొంత మంది అద్దె భవనాల్లో ఉంటున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేయాలని, పూర్తిగా దెబ్బతిన్న వాటిని కూల్చివేసి, కొత్త భవనాలు నిర్మించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.


లక్ష్మీపురంలో శిథిలమైన ఉపాధ్యాయుల క్వార్టర్లు

సర్వేలతో కాలయాపన

ఉపాధ్యాయుల క్వార్టర్ల దుస్థితిని గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో అనేక సార్లు భవనాలను స్థితిగతులపై అధికారులు సర్వే చేశారు. భవనాల పరిస్థితి దారుణంగా ఉండటం వల్ల కూల్చివేయాలని ప్రస్తుతం నివాసం ఉంటున్న వారు సైతం భవనాలను ఖాళీ చేస్తే మంచిదని సర్వే అధికారులు సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించి నిధులు మంజూరైన వెంటనే నూతన భవనాల నిర్మాణాల ప్రక్రియ మొదలు కావచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు నివాస సమస్య తీరుతుందని అంతా భావించారు. కానీ సర్వేతోనే అప్పటి అధికారులు సరిపెట్టాల్సి వచ్చింది.

కొత్త క్వార్టర్లను నిర్మించాలి

ఉపాధ్యాయుల కోసం నిర్మించిన నివాస గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తలుపులు, కిటికీలు, పైకప్పు రేకులు పాడైపోయాయి. ప్రస్తుతం కొంతమంది అద్దె గృహాల్లో ఉంటున్నారు. మరికొంత మంది పాఠశాల గదుల్లోనే నివాసం ఉంటూ సర్దుకుపోతున్నారు. కొత్త క్వార్టర్లు నిర్మించి, నివాస గృహాల సమస్య తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బాలకృష్ణ, ఉపాధ్యాయుడు, లక్ష్మీపురం పాఠశాల, ముంచంగిపుట్టు మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఉపాధ్యాయుల క్వార్టర్లు శిథిలావస్థలకు చేరుకోవడంతో కొంతమంది ఇప్పటికే భవనాలు ఖాళీ చేశారు. మరి కొంత మంది భవనాలపై టార్పాలిన్లు కట్టుకొని నివసిస్తున్నారు. భవనాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. నిధులు మంజూరై, భవనాలు సమకూరితే ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు వసతి సమస్య తీరుతుంది.

– స్వర్ణలత, ఏటీడబ్ల్యూవో, ముంచంగిపుట్టు మండలం


ముంచంగిపుట్టు బాలుర పాఠశాల ఉపాధ్యాయుల క్వార్టర్ దుస్థితి


ముంచంగిపుట్టులో పాడైన క్వార్టర్ కిటికీలు


లక్ష్మీపురంలో క్వార్టర్ పైకప్పుపై కప్పిన టార్పాలిన్

క్లుప్తంగా

విధిగా హెల్మెట్ ధరించాలి


వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ కిశోర్‌వర్మ

కొయ్యూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కొయ్యూరు ఎస్ఐ కిశోర్ వర్మ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

మూడో రోజూ కొనసాగిన ఆందోళన


బాధితులతో మాట్లాడుతున్న ఓఎస్‌డీ మూర్తి, పిన్సిపాల్ సుమంత్‌కుమార్‌సింగ్

డుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల నిర్మాణం కోసం భూములిచ్చిన తమకు ఉద్యోగావాకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బాధితులు చేపట్టిన ఆందోళన మూడో రోజు శనివారం కొనసాగింది. దీక్ష శిబిరాన్ని సందర్శించిన గురుకుల సెల్ ఓఎస్‌డీ మూర్తి, ఏకలవ్య పాఠశాల పిన్సిపాల్ సుమంత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం బాధితుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. బాధితులకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు టి.రాందాసు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. పరశురాం మద్దతు ప్రకటించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


సుజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీలేరు: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్‌కు సీఐటీయూ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. సీలేరు కాంప్లెక్స్ పర్యటనకు వచ్చిన ఆయనను స్థానిక సీఐటీయూ నాయకులు కలిసి తమ సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.లక్ష్మణరావు, విష్ణు, బాపిరాజు, జి.లక్ష్మణ్, ఎస్.రమణ, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం


నిట్టమామిడి, బొందులపనుకు గ్రామాలకు కాలినడకన వెళుతున్న వైద్యసిబ్బంది

జి.మాడుగుల: సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో నాయుడు తెలిపారు. గెమ్మెలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గడుతూరు పంచాయతీలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలు నిట్టమామిడి, జోడిమామిడి, బొందులపనుకు, బొడ్డుమామిడి గ్రామాల్లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాలకు వైద్య సిబ్బంది సుమారు 10కిలోమీటర్లు కాలినడక వెళ్లి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో నాయుడు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాన్పు సమయానికి 10రోజుల ముందుగా గెమ్మెలి ఆరోగ్య కేంద్రంలో చేరాలని తెలిపారు. గ్రామాల్లో అందరూ పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమతెరలను విధిగా వినియోగించాలని సూచించారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజు, ఏఎన్‌ఎం మణికుమారి, వైద్య సిబ్బంది బద్రి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తం


పాలేంలో మందులు పంపిణీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి నరసింహులు

హుకుంపేట: పశువులకు వ్యాధులు సోకకుండా పాడిరైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి నరసింహులు తెలిపారు. మండలంలోని పాతకోట పంచాయతీ పాలేం, గన్నేరుపుట్టు పంచాయతీ డొంకినివలసలో నిర్వహించి పశువైద్య శిబిరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పశు వ్యాధుల నివారణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో 208 పశువులకు, 135 మేకలకు టీకాలు వేయడంతో పాటు 78మంది గిరిజనులకు మందులు పంపిణీ చేశారు. స్థానిక పశువైద్యాధికారి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని డౌనూరు పశు వైద్యులు ఆర్.జె దుర్గప్రసాద్ సూచించారు. శనివారం మల్లవరం, గదబపాలెంలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. 112 పశువులకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. చింతపల్లి సీఏడీడీఎల్ నుంచి వచ్చిన ఆర్. అప్పలనాయుడు, సతీష్‌లు పశువుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. వైద్య సిబ్బంది సత్యనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు


గదబపాలెంలో పశువును పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని వంచంగిలో శనివారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించి, స్థానిక వెటర్నరీ డాక్టర్ తరుణ్ ఆధ్వర్యంలో పశువులకు నట్టలనివారణ మందులు వేశారు. సర్పంచ్ ఆదిరాజు, పద్మావతి, సత్యనారాయణ, సిబ్బంది లక్ష్మణ్, రమణ, సుబ్బరాజు, వీరబాబు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు


వంచంగిలో గేదె పిల్లకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యసిబ్బంది

పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు

- ఎంపీటీసీ బుజ్జిబాబు ఆరోపణ
- అధికారుల తీరుపై సర్వసభ్య సమావేశంలో నిలదీత
- విచారణ జరపాలని డిమాండ్

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు పంచాయతీల్లో 2023 -2024 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అనేక అక్రమాలు జరిగాయని రోడ్లు వేయకుండానే వేసినట్టు చూపించి కాంట్రాక్టర్లక బిల్లులు చెల్లించారని, ఈవ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శనివారం గూడెంకొత్తవీధి మండల పరిషత్ సర్వసభ్యసమావేశం ఎంపీపీ బోయినకుమారి అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మండలంలో ఇప్పటి వరకూ చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాధాన్యత పనులను పూర్తిచేయాలని ఎంపీపీ బోయినకుమారి అన్నారు. ఈ సందర్భగా ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు మాట్లాడుతూ మండలంలో అనేక చోట్ల అభివృద్ధి పనులపేరుతో నిధులు ఖర్చు చూపించారని, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అయి ప్రభుత్వ నిధులను దారిమళ్లించి, ఖాతాల్లో వేసుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు. డోలీమోతలు లేకుండా అన్ని గ్రామాలకు రహదారులు నిర్మించాలని పలువురు సభ్యులు కోరారు. తాగు, సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ పాపారావు, పరిపాలనాధికారి ఇమ్మాన్యుయేల్, మండల ఇంజినీరింగ్ అధికారి జ్యోతిబాబు, విద్యుత్తు శాఖ ఏఈ ప్రభాకర్, వైస్‌ఎంపీపీ దేముడు, కోఆప్షన్ మెంబరు దావీద్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ బోయిన కుమారి, వేదికపై ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

ప్రేరణను సద్వినియోగం చేసుకోండి

జి.మాడుగుల: ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నెల 28న పాడేరులో నిర్వహించనున్న ప్రేరణ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ప్రేరణ కార్యక్రమంపై గిరిజన యువతకు శనివారం అవగాహన కల్పించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ ప్రేరణలో పాల్గొని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. గంజాయి రవాణా, సాగుపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం


ముంచంగిపుట్టులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు

ముంచంగిపుట్టు: ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ నర్సమ్మ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక రెవెన్యూ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించి, సీనియర్ ఓటరు ప్రసాద్‌పడాల్ మాస్టర్‌ను సత్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్‌చంద్ర, రీసర్వే డీటీ భూపతి, సీనియర్ అసిస్టెంట్ కామరాజు, వీఆర్‌వో రమేష్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, ఎంఈవో మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రం గంగవరంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

అడ్డతీగల: అడ్డతీగలలో తహసీల్దార్ కొమరం సూర్యారావు, సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సీతపల్లి జంక్షన్ వరకూ ర్యాలీ సాగింది. అడ్డతీగలలోని సీనియర్ ఓటర్లను సన్మానించారు. సర్పంచ్ పప్పుల చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: ఓటర్లంతా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వై.రామవరంలో శనివారం భారీ ర్యాలీ, స్థానిక బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు.

చింతపల్లి: ప్రతిఒక్కరూ ఓటు హక్కునుసద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రవికుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కార్యాలయం నుంచి పాత బస్టాండ్ జంక్షన్ వరకూ రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులతో కలసి శనివారం ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.చంద్రశేఖర్, మండల రెవెన్యూ అధికారి ఎం.కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ చిన్నారావు పాల్గొన్నారు.


గంగవరంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

పెదబయలు: అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని స్థానిక తహసీల్దార్ గండేరు రంగారావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ కళాశాల, పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కిముడుపల్లిలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లను సన్మానించి, కిముడుపల్లి కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఆర్ఐ వి.పూర్ణయ్య, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవ పథకం, రాజనీతి శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజనీతి శాస్త్ర ఆధ్యాపకులు నాగబాబు, వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజు, పి. కొండబాబు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేటతో పాటు పలు గ్రామాల్లో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కామయ్యపేటలో వీఆర్‌వో, సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ పాంగి బేసు, మాజీ ఎంపీటీసీ రామరావు, వార్డు సభ్యులు శంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొయ్యూరు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం రాజేంద్రపాలెంలో విద్యార్థులతో రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ రాజన్నదొర తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అనంతరం యువత, విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కుమార్, ఎంఆర్ఐ శోభ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ కామేశ్వరరావు, మండల సర్వేయర్ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రాజు, వీఆర్వో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: పలు గ్రామాల్లో ఓటర్ల దినోత్సవకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల పిల్లలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. బోర్నగూడెం ఆశ్రమపాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, హెచ్‌ఎంలు రమేష్, వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం డుంబ్రిగుడలో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, అకడమిక్ గైడెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కళాశాలలో ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ జి.శారద ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జాన్ పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఓటర్ల దినోత్సవం సందర్భంగా డుంబ్రిగుడలో ర్యాలీ చేస్తున్న కళాశాల విద్యార్థులు


అప్పలరాజుపేటలో సన్మానం పొందిన వృద్ధురాలితో పాటు ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు


చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు


కిముడుపల్లిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు


అడ్డతీగలలో నిర్వహిస్తున్న ఓటరు దినోత్సవ ర్యాలీ


వై.రామవరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ


జి.మాడుగులలో సీనియర్ ఓటరును సన్మానిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్


కామయ్యపేటలో ముగ్గుల పోటీలో గెలుపొందిన బాలికకు సర్టిఫికెట్ అందజేస్తున్న సర్పంచ్


రాజేంద్రపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


సీలేరు మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు


అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ విద్యార్థులు

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు


రాయపల్లిలో పాడి రైతులకు మందులు అందజేస్తున్న ఏడీ గణేష్

అడ్డతీగల: మండలంలోని రాయపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో శనివారం పశుసంవర్ధకశాఖ ఏడీ సీహెచ్.గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పశువులు, మేకలు, గొర్రెలకు ఏలిక పాముల నివారణ మందు వేసినట్టు ఏడీ తెలిపారు. కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ వ్యాక్సిన్‌లు వేసినట్టు ఆయన చెప్పారు. రాయపల్లి, తిమ్మాపురం సర్పంచ్‌లు విశ్వనాథం, సోమాలమ్మ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోజుకి రూ.300 కూలి వచ్చేలా చర్యలు


పాపంపేటలో ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో అరవాలు

అడ్డతీగల: ఉపాధి పనుల్లో వేతనదారులకు రోజుకి రూ.300 చొప్పున కూలి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఉపాధి హామీ పథకం ఏపీవో అరవాలు తెలిపారు. మండలంలోని పాపంపేటలో పలువురు వేతనదారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనదారులతో ఉదయం 6 గంటలకు 11 గంటల వరకూ పనులు చేయించాలన్నారు. 50 మంది వేతనదారులకు ఒక మేట్ చొప్పున నియమిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఒక సోక్‌పిట్ తవ్వుకోవాలన్నారు. దానికి రూ.6 వేలు మంజూరు చేస్తారని చెప్పారు. ఉద్యాన వన పంటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు పేర్లు నమోదు చేయాలని సూచించారు.